# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 28-05-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా ఈరోజు పల్నాడు జిల్లా నరసారావు పేటలో ఓట్ల లెక్కింపు సన్నద్ధత, శాంతి భద్రతల పరిరక్షణపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు.

- రిజర్వేషన్ల పేరుతో భారత రాజ్యాంగ మౌలిక స్ఫూర్తిని ఉల్లంఘించడం సరికాదని బీజేపీ అగ్రనేత, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

- కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన క్రిమినల్ చట్టాలు దేశంలో నేర న్యాయ వ్యవస్థను బలోపేతం చేయనున్నాయని అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ బైరా రామకోటేశ్వర రావు తెలిపారు.

- నైరుతి రుతుపవనాలు దక్షిణ అరేబియా సముద్రంలోని మరికొన్ని ప్రాంతాలకు విస్తరించాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలియజేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

షెడ్యూల్డ్ కులాలు, తెగలు, ఇతర వెనుకబడిన తరగతుల ప్రజల హక్కులను కాపాడేందుకు పోరాటం సాగిస్తామని భారతీయ జనతా పార్టీ అగ్రనేత, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. ఒక వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ... రిజర్వేషన్ల పేరుతో భారత రాజ్యాంగ మౌలిక స్ఫూర్తిని ఉల్లంఘించడం సరికాదని పేర్కొన్నారు. అవినీతిని సహించేది లేదని ఒక ప్రశ్నకు సమాధానంగా మోదీ స్పష్టం చేశారు. జమ్ము కశ్మీర్‌లో అత్యధిక ఓటింగ్ శాతం పట్ల సంతృప్తిని వ్యక్తం చేస్తూ... సామాన్యులు ఓటు వేయడమంటే రాజ్యాంగాన్ని అంగీకరించడమని, అదేవిధంగా భారతదేశ స్ఫూర్తి పట్ల తన అంకితభావాన్ని తెలియ చేయడమేనని ప్రధాని అభిప్రాయం వ్యక్తం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా... కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లు, స్ట్రాంగ్ రూములను పరిశీలించేందుకు ఈరోజు డిజిపి శ్రీ హరీష్ కుమార్ గుప్తా తో కలిసి పల్నాడు జిల్లా నరసారావు పేటలో పర్యటించారు. నరసరావు పేటలో వారికి జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠ్కర్, ఎస్పీ మాలికా గార్గ్, జాయింట్ కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ తదితరులు

ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ముఖేష్ కుమార్ మీనా నర్సరావుపేట కలెక్టర్ కార్యాలయంలో ఓట్ల లెక్కింపు సన్నద్ధత, శాంతి భద్రతల పరిరక్షణపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నైరుతి రుతుపవనాలు దక్షిణ అరేబియా సముద్రంలోని మరికొన్ని ప్రాంతాలకు విస్తరించాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం ... ఐఎండి తెలియజేసింది. రానున్న 3 - 4 రోజుల్లో రుతుపవనాలు కేరళ రాష్ట్రంలోనికి ప్రవేశించడానికి పరిస్థితులు అనుకూలంగా మార్పు చెందుతున్నట్టు పేర్కొంది. రాష్ట్రంలోని దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి, పశ్చిమ దిశగా గాలులు వీస్తున్నాయని వివరించింది. రానున్న రెండు రోజుల్లో రాష్ట్రంలోని కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు రెండు నుండి మూడు డిగ్రీలు పెరగవచ్చని ఐఎండి వెల్లడించింది. అదేవిధంగా గంటకు 30 నుడి 40 కిలోమీటర్ల వేగంతో రాష్ట్రంలో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారులు తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సంబల్‌పూర్ - కాచిగూడ ల మధ్య నడిచే వేసవి ప్రత్యేక రైలును జూన్ 17, 24 తేదీల్లో రద్దు చేసినట్లు వాల్తేరు డివిజన్ సీనియర్ కమర్షియల్ మేనేజర్ కే. సందీప్ తెలిపారు. అదేవిధంగా జూన్ 18, 25 తేదీల్లో కాచీగూడ నుండి సంబల్ పూర్ కు వెళ్ళే రైలును రద్దు చేసినట్టు పేర్కొన్నారు. తక్కువ ఆక్యుపెన్సీ కారణంగా ఈ రైళ్ళను ఆయా తేదీల్లో రద్దు చేసినట్టు సందీప్ వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఓట్ల లెక్కింపు జూన్ 4 వ తేదీన ఉదయం 8 గంటలకు, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ఉదయం 7గంటల 30 నిమిషాలకు ప్రారంభమౌతుందని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. లెక్కింపుపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఈరోజు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఉల్లిభద్ర ఉద్యాన కళాశాలలో నాలుగు శాసనసభ నియోజకవర్గాల ఇ.వి.ఎం ఓట్ల లెక్కింపుతో సహా అరకు పార్లమెంటు నియోజకవర్గానికి చెందిన మొత్తం పోస్టల్ బ్యాలెట్లు, నాలుగు శాసనసభ నియోజక వర్గాల పరిధిలోని పార్లమెంటు ఇ.వి.ఎం ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. పార్లమెంటు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు ప్రతి టేబుల్ వద్ద ఒక జిల్లా స్థాయి అధికారిని, సహాయ రిటర్నింగ్ అధికారిగా ఒక గెజిటెడ్ అధికారి, ఇతర సిబ్బంది ఉంటారని ఆయన వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో ఎన్.సి.సి. విస్తరణకు ప్రణాళికలు రూపొందించామని ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల ఎన్.సి.సి. డిప్యూటి డైరక్టర్ జనరల్ ఎం.మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఒంగోలులోని ఎన్.సి.సి. 34వ బెటాలియన్ ఆధ్వర్యంలో ట్రిపుల్ ఐటి క్యాంపస్ లో నిర్వహిస్తున్న శిబిరాన్ని ఈరోజు ఆయన సందర్శించి, క్యాడెట్ల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... రానున్న రిపబ్లిక్ డే పరేడ్ లో పాల్గొనే ఎన్.సి.సి. బృందాన్ని ఎంపిక చేసేందుకు క్యాంప్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గత సంవత్సరం ఆంధ్రప్రదేశ్ క్యాడెట్లు రెండవ స్థానంలో నిలిచారని పేర్కొంటూ... ఈ ఏడాది ప్రథమ స్థానం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన మూడు కొత్త క్రిమినల్ చట్టాలె జులై 1వ తేదీ నుండి అమలులోకి రానున్నాయని అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ బైరా రామకోటేశ్వర రావు తెలిపారు. భారత శిక్షా స్మృతి ఐపీసీ 1860, క్రిమినల్ ప్రొసిజర్ కోడ్ సీఆర్పీసీ 1973, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ 1872 ల స్థానంలో ఈ మూడు చట్టాలు రానున్నాయని

పేర్కొన్నారు. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యా అధినియమ్ అనే మూడు కొత్త క్రిమినల్ చట్టాలు దేశంలో నేర న్యాయ వ్యవస్థను బలోపేతం చేయడానికి ఉద్దేశించినవని వివరించారు.

(వాయిస్ 26 సెకన్లు )

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

బాపట్ల జిల్లా ఎన్నికల అధికారి రంజిత్ బాషా, ఎస్పీ వకుల్ జిందాల్ లు ఈరోజు స్థానిక ఇంజినీరింగ్ కళాశాలను సందర్శించి, స్ట్రాంగ్ రూముల వద్ద భద్రత, ఓట్ల లెక్కింపు కేంద్రాల ఏర్పాట్లను పరిశీలించారు. కౌంటింగ్ రోజు చేపట్టాల్సిన భద్రతా ఏర్పట్లకు సంబంధించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. నియోజకవర్గాల వారీగా కౌంటింగ్ కేంద్రాల ప్రవేశ మార్గాల వద్ద దిక్సూచి బోర్డులను ఏర్పాటు చేయాలని, వీడియోగ్రఫీ తప్పనిసరిగా ఉండాలని సూచించారు. ఎన్నికల సిబ్బందిని క్షుణ్ణంగా తనిఖీ చేసి సెల్ ఫోన్ లు, స్మార్ట్ వాచ్ లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల వంటి వాటిని డిపాజిట్ చేయించిన అనంతరం వారిని లోపలికి అనుమతించాలని ఎస్పీ వకుల్ జిందాల్ ... పోలీస్ అధికారులను ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రానికి వచ్చే అభ్యర్థులు, ఏజెంట్ల వాహనాల పార్కింగ్ కు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని ఎస్పీ సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి బడి పిల్లలందరికీ స్కూల్ కిట్ అందేలా చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. 1 నుండి 10వ తరగతి వరకు చదువుకునే విద్యార్థినీ విద్యార్థులందరికీ నల్ల రంగు బూట్లు, రెండు జతల సాక్స్‌లు అందించాలని నిర్ణయించినట్టు పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా పూర్తి చేసేందుకు అధికారులు, సిబ్బంది సహకరించాలని విజయనగరం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి కోరారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఈరోజు విజయనగరం కలెక్టరేట్‌లో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. పోస్టల్ బ్యాలెట్, ఇవిఎం ఓట్ల లెక్కింపు, కౌంటింగ్ టేబుళ్ల ఏర్పాటు, సిబ్బంది నియామకం, ఏజెంట్లు, అభ్యర్థులు పాటించాల్సిన నియమాలు, తదితర అంశాలను పవర్ పాయింట్ ప్రెజెంటేషణ్ ద్వారా కలెక్టర్ వివరించి, వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఇవిఎం ఓట్ల లెక్కింపు కోసం 14 టేబుళ్లను, పోస్టల్ బ్యాలెట్ కోసం 4 టేబుళ్లను, ఇటిపిబిఎంఎస్ ఓట్ల లెక్కింపునకు మరొక టేబుల్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గడచిన పది రోజులుగా తూర్పుగోదావరి జిల్లాలో కార్డన్ సెర్చ్ ఆపరేషన్లు విస్తృతంగా కొనసాగుతున్నాయని జిల్లా ఎస్పీ పి. జగదీష్ తెలిపారు. ఇందులో భాగంగా నెంబర్లు, రికార్డులు లేని ద్విచక్ర వాహనాలు, ఆటోలు సీజ్ చేశామని పేర్కొన్నారు. అదేవిధంగా నాటు సారా, అక్రమ మద్యం బాటిళ్ళతో పాటు మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నామన్నారు. జిల్లాలో శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నమని ఎస్పీ ఈ సందర్భంగా వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నామని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ చెప్పారు. ఈరోజు ఆయన భీమవరంలో ఆకాశవాణితో మాట్లాడుతూ... కౌంటింగ్ కి సంబంధించిన సూపర్‌వైజర్లు, మైక్రో అబ్జర్వర్లు, ఇతర సిబ్బంది శిక్షణా కార్యక్రమం పూర్తయిందన్నారు. నరసాపురం పార్లమెంటు స్థానానికి సంబంధించి భీమవరం, ఉండి, తాడేపల్లిగూడెం అసెంబ్లీ స్థానాల ఓట్ల లెక్కింపు ఎస్ ఆర్ కే కళాశాలలోనూ... తణుకు, పాలకొల్లు, నరసాపురం, ఆచంట అసెంబ్లీ స్థానాల ఓట్ల లెక్కింపు విష్ణు కళాశాలలోను

చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు వివరించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నట్టు కలెక్టర్ తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =